కథ

# నన్ను క్షమించమ్మా

- కల్లం సుందర రామిరెడ్డి



"మొద్దుది ఎంత కొట్టినా ఏడవదు."

"అది ఎందుకు ఏడుస్తుంది నాయనా.

దాన్ని కొట్టినా ఒకటే పశువుని కొట్టినా ఒకటే

"అయితే కిరోసిన్ డబ్బా తీసుకు రామ్మా ఎందుకు ఏడవదో చూద్దాం. దెబ్బకి చస్తుంది"

"ఈసారికి ఊరుకోరా మూర్తి.

మనమీద పక్కవాళ్ళకి చాడీలు చెపితే అవుడు చూద్దాం.

నువ్వు బయటికి వెళ్ళు"అంది తల్లి మంగమ్మ.

భార్య సీత వైపు వురిమి చూస్తూ చేతిలో ఉన్న కర్రని కింద పడేసి బైటి కెళ్ళాడు మూర్తి కోపంగా.

సీత శరీరం భర్త కొట్టిన దెబ్బలకు హూనమైంది.

అయినా ఆమె ఏడుస్తూ కూర్చోలేదు.

కన్నీళ్ళు తడుచుకుని మొహం కడుక్కుని బొట్టు పెట్టుకుని ఉన్నది తిని పనికి వెళ్ళడానికి బైటకొచ్చింది చిరునవ్వుతో.

బైట వున్న ఆడవారు బిత్తర పోయారు సీతని చూసి......

** ** **

సీతకి పెళ్ళయి అయిదేళ్ళవుతోంది.

వ్యసన పరుడైన భర్త,గయ్యాళి అత్తతో సీతకు కష్టాలు మొదట్లోనే ప్రారంభ మయ్యాయి. ఆమెకి ఆత్మాభిమానం చాలా ఎక్కువ.ఎవరినీ ఏమీ అడగదు.ఎవరేదన్నా ఇచ్చినా తీసుకోదు. ఉన్నదానితోనే తృప్తి పడుతుంది. భర్త ఎంతహింసించినా, అత్త ఎంత పోరు పెట్టినా బైటికి తెలియనీయకుండా గట్టుగా కాపురం చేయటం సీత గొప్పదనం.

అది చూసి ఆవీధి అమ్మలక్కలు సీతకు పొగరుబోతు ఆడది అని పేరు పెట్టారు.

ఆస్తి ఐశ్వర్యాలు వున్న మన కాపురాలు ఏవో గొడవలతో వీధికెక్కుతుంటాయి. కానీ దేనితోనూ సమానం కాని సీత ఎలా గుట్టుగా కాపురం చేస్తుందీ?

ఏమిటి ఆమె గొప్ప?

ఎలాగైనా సరే సీత కాపురం మన కాపురం కన్నా గొప్పది కాదని నిరూపించాలి అనుకున్నారంతా.అందులో భాగం గానే సీతమీద అత్తకి లేనిపోనివి చెప్పి భర్త చేత నానా హింసలూ పెట్టించారు.

అయినా సీత చలించ లేదు.ఇంట్లోని వారు ఎంత హింసించినా కన్నీళ్ళను బైటికి రానివ్వకుండా కళ్ళలోనే కుక్కుకుని చిరునవ్వుతో బైటికి వస్తుంది. లాభంలేదు అనుకున్న ఆడవాళ్ళంతా అత్తమీద సీతకు చాడీలు చెప్పటం ప్రారంభించారు.

ఒకరోజు చాడీలు చెప్పటంకోసం వచ్చిన ఆడవాళ్ళతో

"మీకుచాడీలు చెప్పటం తప్ప వేరే పని లేదా.

మొన్న మాఅత్తయ్యతో నామీద చాడీలు చెప్పారు.

ఈరోజు అత్తయ్య మీద నాకు చాడీలు చెవుతున్నారు.

మాఅత్తయ్య నన్ను కొట్టినా, తిట్టినా, నాకు ఇష్టమే.

నామనసులో అత్తయ్య దేవతే కాదు అమ్మ కూడా.

అమ్మకొడితే నేను బాధ పడను.ఇంక మీరు వెళ్ళండి.ఇంకెప్పుడూ ఇలా చాడీలు చెప్పకండి" అంది.

బైటికి వెళ్ళొస్తున్న మంగమ్మ లోపల వంచీ మాటలు వినబడటంతో గోడ చాటున వుండి అంతా విన్నది. ఆమెహృదయం పశ్చాత్తాపంతో నిండి పోయింది.

కన్నీళ్ళతో కోడలి దగ్గరకు వచ్చి

"నన్ను క్షమించమ్మా....నిన్ను సరిగా అర్థం చేసుకోలేక పోయాను"అంటూ చేతులు పట్టుకుని

"ఈరోజు నుంచీ నిన్ను కోడలిగా కాకుండా కన్న కూతురిగా చూసుకుంటాను"అంది అంత మందిలో.

ఇది చూసి సిగ్గుపడి, తమ తప్పు తెలును... వారై మెల్లిగా జారుకున్నారు ఆడవాళ్ళంతా.